జూన్ 14న చిత్రామృతం 2.0 పేరుతో సంగీతోత్సవం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ గాయకుడు ఎస్పీ.చరణ్, గేయరచయిత చంద్రబోస్

బంజారాహిల్స్,ఏప్రిల్ 22: ప్రముఖ నేపథ్య గాయని చిత్ర 45 ఏండ్ల ప్రస్థానం సందర్భంగా జూన్ 14న హైదరాబాద్ నగరంలో 'చిత్రామృతం 2.0' పేరుతో ప్రత్యేక సంగీతోత్సవం నిర్వహించనున్నామని గాయకుడు ఎస్పీ.చరణ్ తెలిపారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గేయ రచయిత చంద్రబోస్ చిత్రామృతం 2.0 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ.. కాలాన్ని దాటి మనసులను తాకేలా పాడడం గాయని చిత్ర ప్రత్యేకతన్నారు. తండ్రి ఎస్పీ బాలుతో కలిసి అనేక అద్భుతమైన గీతాలను చిత్ర ఆలపించి శ్రోతలను ఆకట్టుకున్నారన్నారు. తాను రాసిన అనేక పాటలకు చిత్ర తన గాత్రంతో ప్రాణం పోశారన్నారు.

నేలను కాపాడుకుందాం బతుకుకు భరోసానిద్దాం

జగదీశ్వర్

వ్యవసాయ యూనివర్సిటీ : నేలమ్మను ఎంత కాపాడుకుంటే అంత మన బతుకుకు భరోసా ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విశ్రాంతి పరిశోధన సంచాలకులు డాక్టర్ ఆర్ జగదీశ్వర్ , వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు .పారిశ్రామిక మానవ కార్యకలాపాల వల్ల ప్రకృతి వనరులపై అంతకంతకు ఒత్తిడి పెరుగుతుందన్నారు. పొల్యూషన్‌తో పాటు అధిక దిగుబడులే లక్ష్యంగా వ్యవసాయం చేస్తుండడంతో రసాయన ఎరువులు, పురుగులమందుల వినియోగం విచ్చలవిడిగా పెరిగిందన్నారు. సింథటిక్ ఫైరోడ్స్ వంటి రసాయనాల వల్ల నేలలోని ప్రయోజనకరంగా ఉన్న సూక్ష్మజీవులు, సిలింద్రాలు నశించిపోతున్నాయన్నారు. పర్యావసనంగా నేల సహజతత్వం కోల్పోయి పంట పొలాలు నిస్సారమవుతున్నాయన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా అడవుల నరికివేతను అడ్డుకోవాలన్నారు. ఈ క్రమంలో పౌరులతో పాటు కార్పొరేట్ స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలన్నారు.

బొట్టుపెట్టి ..ఆత్మీయ ఆహ్వానం

_ఛలో వరంగల్ సభకు కార్పొరేటర్ కవితారెడ్డి ప్రచారం

బీఆర్ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రావాలంటూ వెంకటేశ్వర కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 5లోని ధోబీఘాట్ బస్తీలో ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. రజతోత్సవ వేడుకకు కుటుంబ సమేతంగా రావాలంటూ కార్పొరేటర్ కవితారెడ్డి కోరడం అందరినీ ఆకట్టుకుంది.

– బంజారాహిల్స్, ఏప్రిల్ 22:

శాఖల మధ్య.. సమన్వయ లోపంతో...

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని క్యాన్సర్ ఆస్పత్రి నుంచి బ్రహ్మకుమారీస్ రోడ్డులో చెత్తాచెదారం

చెత్తను మాత్రం తొలగించి మట్టిని వదిలిపెట్టిన శానిటేషన్ విభాగం సిబ్బంది

చెత్త తొలగింది..మట్టి మిగిలింది

- చెత్త మాది.. మట్టి వారిది.. అంటూ వెళ్లిపోయిన శానిటేషన్ సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు

బంజారాహిల్స్,ఏప్రిల్ 22: నవ్విపోదురుగాక నాకేటి సిగ్గన్న చందంగా తయారైంది జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం పనితీరు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలకు తోడు నిర్మాణ వ్యర్థాలు పారబోస్తుంటే చర్యలు తీసుకోవాల్సిన పారిశుద్ధ్య విభాగం ప్రేక్షకపాత్ర వహిస్తుండడంతో కాలనీలు, బస్తీల్లో చెత్త సమస్యలు తీవ్రమవుతున్నవైనాన్ని 'నమస్తే తెలంగాణ' మంగళవారం 'ఎక్కడి చెత్త అక్కడే..' అనే శీర్షికతో ప్రచురించింది. దీంతో ఆగమేఘాల మీద రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ సర్కిల్-18 శానిటేషన్ విభాగం అధికారులు చెత్తను తొలగించే పనులు చేపట్టారు. దీనిలో భాగంగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని క్యాన్సర్ ఆస్పత్రి నుంచి బ్రహ్మకుమారీస్ వైపు వెళ్తున్న రోడ్డులో చెత్తను తొలగించిన శానిటేషన్ సిబ్బంది, దానికింద ఉన్న మట్టిదిబ్బలను మాత్రం అలాగే వదిలేశారు.

ఇటీవల రోడ్డును వేసిన కాంట్రాక్టర్ ఈ మట్టిని తొలగించాల్సి ఉంటుందని, తమకు సంబంధం లేదని అక్కడ నుంచి వెళ్లిపోయారు. బల్దియాలోని శాఖల మధ్య సమన్వయలేమికి ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాణించిన విద్యార్థులు

బండ్లగూడ, ఏప్రిల్ 22. ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. వెయ్యికి అత్యంత సమీపంలో మార్కులు సాధించి విద్యార్థులు సత్తా చాటారు. మ్యాథమెటిక్స్‌లో బండారి హన్సిక వెయ్యికి 973 మార్కులు సాధించింది. బైపీసీలో ఫాతిమా అన్సారి వెయ్యికి 984 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. సాయి సింధూరి 1000 కి 983 మార్కులు సాధించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఎంపీసీలో బి మౌనిక 470 మార్కులకు గాను 454 మార్కులు, బైపీసీలో జోయా హుసేని 440 మార్కులకు గాను 430 మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం 45 శాతం , మొదటి సంవత్సరంలో 48 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె పేర్కొన్నారు.

బండారి హన్సిక ఎంపీసీలో (973)

ఫాతిమా అన్సారి బైపీసీలో (984)

సాయి సింధూరి బైపీసీలో (983)

ఇంటర్ ప్రథమ ఫలితాల్లో .. చైతన్యహబ్ కాలేజీ ప్రభంజనం

హిమాయత్‌నగర్,ఏప్రిల్ 22: ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక ఫలితాల్లో హిమాయత్‌నగర్‌లోని చైతన్య హబ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి విద్యార్థులు తమ సత్తాచాటారు.ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూప్‌లో ప్రజక్త మాడపాటి 467, గోపు వినమ్రత 466,శ్రీజ కొతలంక 454, షేజా అబ్బాద్ రజ్వీ 449,సి. క్రిశాంక్ 446, త్రిషిత సమంత 444, గురు పవిత్ర 441, మహమ్మద్ షానూర్ 431, పి. వృజుల శ్రీ 431, బి.ధాత్రిగ 425, రిడాఖాన్ 421, బైపీసీలో అక్షజ కల్యాణ్‌కర్ 436, స్నేహదాస్ 432, ఆయేషా ఫాతిమా 420, సీఈసీలో సుమయా సుల్తానా 490 మార్కులు సాధించినట్లు చైతన్య హబ్ జూనియర్ కళాశాల చైర్మన్ వి.వి.హనుమంత్ రావు తెలిపారు.

భవిష్యత్తులో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే తమ కళాశాల ఏకైక లక్ష్యమని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి పునరుద్ధరణతోనే ..పర్యావరణ పరిరక్షణ సాధ్యం

హిమాయత్ నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వేదకుమార్

హిమాయత్ నగర్, ఏప్రిల్ 22 : ప్రకృతి పునరుద్ధరణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ చీఫ్ పాట్రన్ మణికొండ వేదకుమార్ అన్నారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద పౌర ఉత్సవాల్లో ఒకటిగా ఈ వేడుక నిలిచిందని, జీవవైవిధ్యం, వాతావరణ మార్పులు, వ్యర్థాల తగ్గింపు, మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. పర్యావరణ నిర్వహణపై నిబద్ధత, ప్లాస్టిక్ ఫ్రీ జోన్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రాం మాంజుల, ప్రిన్సిపాల్ రేఖారావు, ఫాతిమా ఖాజిమ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిర్వహణపై అవగాహన

బండ్లగూడ, ఏప్రిల్ 22. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సీఈవో నవేద్ ఆలం ఖాన్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ తదితరులు తన సిబ్బందితో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని వారు ఆకాంక్షించారు.

శిశువిహార్‌లో ఎస్సీపీసీఆర్ కమిషన్ పర్యటన

శిశువిహార్‌లో వంటగదిని పరిశీలిస్తున్న ఎస్సీపీసీఆర్ కమిషన్ బృందం

వెంగళరావునగర్, ఏప్రిల్ 22 : స్టేట్ హోం ఆవరణలోని శిశువిహార్‌లో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బృందం మంగళవారం పర్యటించింది. స్టేట్ హోం శిశు విహార్‌లో ఆశ్రయం పొందుతున్న పిల్లల గదులను తనిఖీ చేశారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి, సభ్యులు కంచర్ల వందన గౌడ్, మరిపల్లి చందన, బి.అపర్ణ, ప్రేమలతా అగర్వాల్, బి.వచన్ కుమార్ శిశు విహార్‌లో ఆకస్మికంగా పర్యటించి తనిఖీ చేశారు. పిల్లలు తినే డైనింగ్ హాలు, స్టోర్ రూమ్ నిర్వహణ పరిశీలించారు. ప్రీ స్కూల్‌లో పిల్లలతో సంభాషించారు. పిల్లల పట్ల శ్రద్ధ, ప్రేమ, ఆప్యాయత చూపే శిశువిహార్ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

మేడేను విజయవంతం చేయాలి

శంషాబాద్‌లో మేడే వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, తదితరులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 22 : మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని సీఐటీయూ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ మాట్లాడుతూ మేడేను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. మేడే రోజున శంషాబాద్ మున్సిపాలిటీలోని వివిధ వార్డులు,మండలంలోని అన్ని గ్రామాల్లో ఎర్రజెండాలు రెపరెపలాడాలన్నారు. ప్రపంచ కార్మికులందరూ ఏకమై పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవడమే కాకుండా 44 చట్టాలను తొలగించి నాలుగు రకాల కోడ్‌లను తెచ్చి కార్మిక చట్టాలను కాలరాసి కార్మికులకు ఏ హక్కు లేకుండా చేయడమే ఈ కేంద్ర ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఈ కోడ్‌లకు వ్యతిరేకంగా మేడే కార్యక్రమాలు నిర్వహించాలని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లేష్, శంషాబాద్ మండల మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి నాగేష్,నాయకులు జయేందర్, యాదమ్మ,సంపత్,సత్తయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం: జలమండలి నూతన డైరెక్టర్ (పర్సనల్ అడ్మినిస్ట్రేషన్) అబ్దుల్ ఖాదర్‌ను జల మండలి ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి, అధ్యక్షులు కె. రమణారెడ్డి, ఉపాధ్యక్షులు ఎల్ ప్రభాకర్ రెడ్డి, పి. జనార్దన్, అసిసోయేట్ అధ్యక్షులు గుల్జార్ అహ్మద్, కె. కమలాశ్రీ, ప్రధాన కార్యదర్శి ఎ. సావీర్‌కుమార్ పాల్గొన్నారు. –ఖైరతాబాద్.

సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం

మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ

సెక్రటేరియట్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, ఏప్రిల్ 22: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు ముమ్మరం చేస్తున్నామని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు. గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మంగళవారం సెక్రటేరియట్ కాలనీలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా విద్యుత్ వైర్లు చేతికందే విధంగా వేలాడడం వల్ల ప్రాణనష్టం జరిగే ఆస్కారం ఉందన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వీధిదీపాలు సైతం వెలగడం లేదని దీని కారణంగా స్థానిక ప్రాంతాలన్ని అంధకారంలో ఉంటున్నాయన్నారు. వీధులన్ని చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోతున్నాయన్నారు.అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంబగళ్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, బుద్దోలు బాబు, గోరుకంటి విఠల్, సుమనళిని, కోడిచెర్ల దేవేందర్, శ్రీనివాస్‌చారి, బిట్లుగా రాజు తదితరులున్నారు.

బీ ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ కోర్సు పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీ ఫార్మసీ (పీసీఐ) సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీలో.. అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీలో భారీ షెడ్‌లను కూల్చివేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 22: అక్రమ నిర్మాణాలకు పాల్పడితే వాటిని గుర్తించి కూల్చివేయడం జరుగుతుందని జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ సూచించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీలో అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. అక్రమంగా వెలుస్తున్న షెడ్‌లపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు స్పందించి మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి కూల్చివేతలను ప్రారంభించారు.

అధికారులు, పోలీసుల భారీ బందోబస్తు మధ్య మూడు జేసీబీల సహాయంతో కూల్చివేతలను చేపట్టారు. సర్వే నెంబర్ 168 నుంచి 178లో అక్రమంగా వెలిసిన ఐదు షెడ్‌లను నేలమట్టం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత

విద్యార్థులకు లంచ్‌బాక్స్, స్టేషనరి సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

మణికొండ, ఏప్రిల్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను అందించేందుకు ముందుకు రావాలని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ మండల పరిషత్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఖాజాగూడ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల సహకారంతో 120 లంచ్ బాక్స్‌లు, బ్యాగులు, టోపీలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని తమ లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథ్‌నాయక్, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుద్దోళ్లు శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ కుమార్, లక్ష్మీశ్రీ, నాయకులు శ్రావణ్‌కుమార్, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు నెలల జీతం ఇచ్చి..

శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నియమించిన విద్యావలంటర్‌కు పెద్దషాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ , బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణగౌడ్ మంగళవారం స్వయంగా రెండు నెలల గౌరవ వేతనం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల్‌రాజ్ , బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్‌గౌస్‌పాషా,కపిల్‌దేవ్,మాజీవార్డు సభ్యుడు శ్రీధర్‌బాబు, ఉపాధ్యాయులు వందన, అశ్విని, మృదులత తదితరులు పాల్గొన్నారు. – శంషాబాద్ రూరల్

తెలుగు భాష ఔనత్యాన్ని చాటాలి

శాసనమండలి సభాపతి గుత్తా సుఖేందర్ రెడ్డి

పురస్కారాలను అందజేస్తున్న సుఖేందర్ రెడ్డి, ధర్మారావు

ఖైరతాబాద్, ఏప్రిల్ 22 : తెలుగు భాష ఔనత్యాన్ని ప్రపంచానికి చాటాలని శాసనమండలి సభాపతి గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సాంస్కృతిక, సారస్వత సంఘం (ఇట్కాల) ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉత్తమ పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవల్లో తెలుగు వారి ఖ్యాతి ఎంతో గొప్పదన్నారు. అలాంటి వారిని 'ఇట్కాల' ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. అనంతరం మృదంగ విద్వాంసులు డాక్టర్ ఎల్లా వెంకటేశ్వర రావు, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న లయన్ డాక్టర్ ఎ. నటరాజ్, సి. రామకృష్ణ, డాక్టర్ బింగి నరేందర్ గౌడ్‌తో పాటు ఓ తెలుగు దినపత్రికకు విశ్వతెలుగు వెలుగు పురస్కారాలను సుఖేందర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సాంస్కృతిక, సారస్వత సంఘం వ్యవస్థాపకులు, సంస్కృతిరత్న డాక్టర్ కె. ధర్మారావు, అవార్డుల కమిటీ కన్వీనర్ వాస్తు ప్రవీణ, పి. కృష్ణాది శేషు పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి

మణికొండ, ఏప్రిల్ 22: స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయం అని నార్సింగి అధ్యక్షులు కె.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి 25వ వర్ధంతిని పురస్కరించుకోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నిజాముద్దీన్, గణేష్‌ముదిరాజ్, గణేష్‌రెడ్డి, విష్ణు, వెంకటేష్, నర్సింహ్మ, నీరుడు స్వామి, సంతోష్, సందీప్, వినోద్, సంతోష్, సాయి, విక్రమ్, హనుమాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సర్గీయ ఇంద్రారెడ్డి సేవలు మరువలేవి

శంషాబాద్ రూరల్: మాజీ మంత్రి సర్గీయ ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు అన్నారు. మండలంలోని పాలమాకుల గ్రామంలో మాజీ మంత్రి ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యాశాఖ, కార్మిక శాఖ, హోంశాఖ మంత్రిగా పని చేసిన ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. తన వాహనంపై జై తెలంగాణ రాసుకొని ఎంతో మందికి తెలంగాణ ఉద్యమానికి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, గూడెపు ఆశోక్, రమేష్‌గౌడ్, గిరిగౌడ్, ఆంజనేయులు, నరేష్, లక్ష్మణ్‌నాయక్,శ్రీనివాస్‌యాదవ్, రవీందర్,గూడల కిష్ణయ్యగౌడ్,హుమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో..

బండ్లగూడ: మాజీ మంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గా ఖలీజ్‌ఖాన్‌లో రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రావుల కోళ్ల నాగరాజు, మాజీ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి, రవికుమార్, పాండు, వెంకటేష్ సుధాకర్ గౌడ్, చంద్రశేఖర్ అశోక్, శాంతి కుమార్, వినోద్, శామ్యూల్, పెంటయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పాలమాకుల గ్రామంలో